క్లుప్తంగా

బోధనా సామర్థ్యం పెంపొందాలి



చాట్రాయి: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు బోధనా సామర్థ్యాన్ని పెంపొందించాలని ఎంఈఓ బ్రహ్మాచారి తెలిపారు. చాట్రాయి జెడ్పీ హైస్కూల్‌లో అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహిస్తున్న జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమంలో గురువారం ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ శిక్షణ ద్వారా చిన్నారులకు అవసరమైన శారీరక అభివృద్ధి, విద్యను బలోపేతం చేయాలని ఆయన సూచించారు. ఎంపీడీఓ విజయలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

వర్మి కంపోస్టు ఉత్పత్తిపై దృష్టి సారించండి

డీఎల్‌పీఓ రాఘవన్



జి.కొండూరు: వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్లను వాడుకలోకి తీసుకువచ్చి వానపాముల ఎరువు ఉత్పత్తిపై దృష్టి సారించాలని డివిజినల్ లెవెల్ పంచాయతీ అధికారి జీఎల్ఎన్‌వి రాఘవన్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్ల నిర్వహణపై గ్రామ పంచాయతీ కార్యదర్శులతో గురువారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. డీఎల్‌పీఓ మాట్లాడుతూ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్ల నిర్వహణపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇంటింటికి తిరిగి తడి, పొడి చెత్త సేకరణపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. త్వరితగతిన ఇంటి పన్నుల వసూళ్లను పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో కార్యదర్శులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నిర్మూలనపై అవగాహన ర్యాలీ



చాట్రాయి: క్షయ వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చాట్రాయి పీహెచ్‌సీ వైద్యులు ఎం.జ్యోతి అన్నారు. చాట్రాయిలో గురువారం నిర్వహించిన జాతీయ క్షయ వ్యాధి నివారణ దినోత్సవంలో ఆమె మాట్లాడుతూ ఎవరిలోనైనా రెండు వారాలకు మించి దగ్గు, సాయంత్రం జ్వరం, క్రమేపీ బరువు తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తే వైద్యులను సంప్రదించాలన్నారు. కఫం ద్వారా టీబీ వ్యాధిని నిర్ధారణ చేసే ట్రూనాట్ ఎంటీబీ పరీక్ష పీహెచ్‌సీలో ఉందని చెప్పారు. కార్యక్రమంలో ల్యాబ్ సూపర్‌వైజర్ రామాంజనేయులు, సీహెచ్‌ఓ రమణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్ఫూర్తి స్టడీ మెటీరియల్ పంపిణీ



ముసునూరు: ప్రభుత్వం అందిస్తున్న ప్రతి పథకాన్ని విద్యార్థులు సమర్థవంతంగా వినియోగించుకోవాలని హెచ్‌ఎం రామకృష్ణారావు పిలుపునిచ్చారు. రమణక్కపేట, చెక్కపల్లి జెడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎంలు రామకృష్ణారావు, అబ్బాస్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులు 153 మందికి ఉమ్మడి కృష్ణా జిల్లా పరిషత్ విద్యా శాఖ అందజేసిన స్ఫూర్తి మెటీరియల్స్‌ను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎంలు మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు స్టడీ మెటీరియల్ సహాయంతో పబ్లిక్ పరీక్షలకు వేగంగా సన్నద్ధం కావాలని, మెటీరియల్‌ను సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమాల్లో ఎస్‌ఎంసీ చైర్మన్లు ఎన్.రాజా, పి.రామచంద్రరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

20 లీటర్ల సారా స్వాధీనం



నూజివీడు: యనమదలలోని సారా శిబిరంపై గురువారం దాడులు నిర్వహించినట్లు ఏలూరు జిల్లా అసిస్టెంట్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ సీహెచ్ అజయ్ కుమార్‌సింగ్ తెలిపారు. ఈ దాడుల్లో 20 లీటర్ల సారా, స్కూటీని స్వాధీనం చేసుకుని, సిద్ధార్థ నగర్‌కు చెందిన లావూరి వెంకట శ్రీనివాసరావును అదుపులోకి తీసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ పీఎస్‌డీ భోగేశ్వరరావు సిబ్బంది పాల్గొన్నారు.

దశాబ్దాలుగా ప్రతిపాదనలకే పరిమితం

- తిరువూరులో పశు వీర్య గణాభివృద్ధి కేంద్రం ఏర్పాటుకు గ్రహణం
- వెయ్యి ఎకరాల భూమి కేటాయింపు
- వేలాది కుటుంబాలకు ప్రయోజనం

తిరువూరు: పారిశ్రామికంగా వెనుకబడిన తిరువూరు నియోజకవర్గంలో వ్యవసాయాధారిత పరిశ్రమల ఏర్పాటుకు 37 ఏళ్ల కిందట చేసిన ప్రతిపాదనలు నేటికీ అమలుకు నోచుకోలేదు. తిరువూరు సమీపంలోని లక్ష్మీపురం వద్ద జాతీయ రహదారి పక్కన 945 ఎకరాల అటవీ భూమిని పశు వీర్య గణాభివృద్ధి కేంద్రం ఏర్పాటు నిమిత్తం 1987లో కేటాయిస్తూ అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. రామన్నపాలెం, చిట్టేల, ఆంజనేయపురం రెవెన్యూ గ్రామాల పరిధిలోని కాకర్ల ఫారెస్ట్ బ్లాక్‌లో ఈ భూమిని గేదెల పెంపకం, పశు వీర్య గణాభి వృద్ధి నిమిత్తం కేటాయిస్తూ జిల్లా కలెక్టర్ నుంచి తిరువూరు మండల రెవెన్యూ అధికారికి ఉత్తర్వులు జారీచేశారు. అనంతరం అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో పనులు ప్రారంభం కాలేదు.

వేలాది కుటుంబాలకు ప్రయోజనం

ఈ పరిశ్రమ ఏర్పాటైతే ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు వెయ్యి కుటుంబాలకు ప్రయోజనం కలుగుతుంది. పాడి పశువుల్లో కృత్రిమ గర్భధారణకై సెమన్ తయారీ నిమిత్తం ఈ పరిశ్రమ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం 1989లో నిధులు కేటాయించినా పనులు చేపట్టలేదు. నాటి పార్లమెంటు సభ్యులు పలుమార్లు ఈ విషయాన్ని పార్లమెంటులో ప్రస్తావించినా పశు సంవర్ధక శాఖ నుంచి స్పందన కరువైంది.



తిరువూరు సమీపంలో పశు వీర్య గణాభివృద్ధి కేంద్రానికి కేటాయించిన భూమి

కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళతాం



తిరువూరు ప్రాంత అభివృద్ధికి దోహదపడే పశు వీర్య గణాభివృద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి కృషి చేస్తాం. దీర్ఘకాలంగా ప్రజలు కోరుతున్న వ్యవసాయాధారిత పరిశ్రమలు మరికొన్ని కూడా ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తాం.

– అన్నవరపు సత్యనారాయణ, బీజేపీ నాయకులు

వెంటనే ఏర్పాటు చేయాలి



తిరువూరు ప్రాంతంలో వ్యవసాయాధారిత పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని గత పార్లమెంటు సభ్యులు పదే పదే ప్రకటించినా కార్యాచరణ శూన్యం. కాకర్ల భూముల్లో పశు వీర్య గణాభివృద్ధి కేంద్రాన్ని వెంటనే ఏర్పాటు చేయాలి.

– పరసా నెహ్రూజీ, తిరువూరు

ఆక్రమణకు గురవుతున్న భూములు

పశు వీర్య గణాభివృద్ధి కేంద్రానికి కేటాయించిన భూములు గత పదేళ్లలో అన్యాక్రాంతమయ్యాయి. కొందరు రైతులు ఈ భూమికి సరిహద్దుల్లో కొంత మేర ఆక్రమించినట్లు రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం సర్వే నిర్వహించి ఈ పరిశ్రమకు కేటాయించిన భూమి సరిహద్దులు గుర్తించాలని, వెంటనే పరిశ్రమ పనులు చేపట్టాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

తుమ్మగూడెం–సూరేపల్లి రోడ్డుకు మోక్షమెప్పుడో?

చాట్రాయి: మండలంలోని తుమ్మగూడెం–సూరేపల్లి బీటీ రోడ్డు పనులకు మోక్షం కలగక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. తుమ్మగూడెం నుంచి నూజివీడుకు వెళ్లాలంటే ఇది ఒక్కటే దగ్గర మార్గం. రోడ్డు అభివృద్ధికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు సహకారంతో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.2.60 కోట్లు మంజూరు చేసి గత మార్చిలో శంకుస్థాపన చేశారు. టెండర్లు పిలిచి చిన్నపాటి మరమ్మతులు చేశారు. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో పనులను నిలిపి వేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఎనిమిది నెలలు గడిచినా ఈ రోడ్డు పనులు ప్రారంభం కాలేదు. ప్రజలకు ఉపయోగపడే ఈ రోడ్డు పనులకు ప్రాధాన్యత ఇవ్వకపోవడం దారుణమని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



తుమ్మగూడెం–సూరేపల్లి రహదారి దుస్థితి

నూజివీడు ఆస్పత్రికి వెళ్లాలన్నా, విద్యార్థులు కాలేజీలకు వెళ్లాలన్నా, 108 వాహనం ద్వారా ఆస్పత్రికి వెళ్లాలన్నా ఈ రోడ్డు చాలా అవసరమని ప్రజలు చెబుతున్నారు. ఇప్పటికైనా ఈ రోడ్డు పనులు ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.

మార్చి 8న జాతీయ లోక్ అదాలత్

నూజివీడు: లోక్ అదాలత్ కార్యక్రమం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మార్చి 8న నిర్వహిస్తామని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, 15వ అదనపు జిల్లా జడ్జి ఎ.నాగశైలజ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కేసులను రాజీ మార్గంలో పరిష్కరించుకునేందుకు సుముఖంగా ఉన్న కక్షిదారులు లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చన్నారు. ఇందులో రాజీకి వీలున్న క్రిమినల్ కేసులు, బ్యాంకు రికవరీ కేసులు, ఎక్సైజ్ కేసులు, సివిల్ కేసులు, చెక్‌బౌన్స్ కేసులు, మోటార్ యాక్సిడెంట్ కేసులు తదితర వాటిని రాజీ చేసుకోవచ్చని చెప్పారు. ఇతర వివరాలకు న్యాయస్థానాల భవనం ప్రాంగణంలోని మండల న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో సంప్రదించవచ్చన్నారు.

- **మైలవరం:** జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం మార్చి 8వ తేదీన నిర్వహిస్తామని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, మైలవరం జూనియర్ సివిల్ జడ్జి ఎం. శైలజ తెలిపారు. గురువారం జరిగిన సమావేశంలో జడ్జి మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా న్యాయవాదులు, పోలీసులు కక్షిదారులను చైతన్యవంతం చేయాలని సూచించారు. సమావేశంలో సీనియర్ న్యాయవాదులు పి. వెంకటశేషగిరిరావు, బి. వెంకట్రావు, శ్రీనివాసరావు, పి. రాము, ఎం. తానోజ్, డి. సుజిని, దివ్య తదితరులు పాల్గొన్నారు.

తవ్వారు.. వదిలేశారు!

- రహదారికి అడ్డంగా గొయ్యి తవ్వి వదిలేసిన వైనం
- ప్రధాన పైపులైను నుంచి వృథాగా పోతున్న కృష్ణా వాటర్
- పక్కనే కాలనీ వాసులకు అందని తాగునీరు

జి.కొండూరు: జి.కొండూరు నుంచి గంగినేని వరకు రహదారి విస్తరణలో భాగంగా జి.కొండూరు బీసీ కాలనీ మూడో రోడ్డు వద్ద ఇటీవల డ్రెయినేజీ కోసం తూములు వేశారు. తూములను వేసేందుకు రహదారిని తవ్విన క్రమంలో కృష్ణా వాటర్ పైపులైను పగిలిపోవడంతో పాటు పలు నెట్‌వర్క్ కంపెనీలకు చెందిన కేబుళ్లు తెగిపోయాయి. వీటి మరమ్మతుల్లో భాగంగా బీసీ కాలనీ మూడో రోడ్డుకు అడ్డంగా గొయ్యి తవ్వారు. నెట్‌వర్క్ కేబుళ్లు, పైపులైను మరమ్మతులు పూర్తయ్యాయి. కానీ తవ్విన గొయ్యిని అలానే వదిలేశారు. దీనితో ఈ రోడ్డులో నివాసం ఉండే కాలనీ వాసులు ప్రధాన రహదారిపైకి రావడానికి గత ఇరవై రోజులుగా ప్రతి రోజూ ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు వెంటనే మరమ్మతులు పూర్తి చేసి గొయ్యిని పూడ్చాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

విరిగిపోయిన సబ్ చానల్ పైపు..

అదేవిధంగా ఈ ప్రదేశంలో కృష్ణా వాటర్ ప్రధాన పైపులైన్‌కు చేపట్టిన మరమ్మతుల్లో పైపునకు జాయింట్ వద్ద ఒక వైపు వెల్డింగ్ చేసి మరో వైపు వెల్డింగ్ చేయకుండా వదిలివేయడంతో తాగునీరు వృథాగా పోతోంది. అంతేకాకుండా ఇక్కడ తూములు ఏర్పాటు చేసినప్పుడు మూడో రోడ్డులోని కాలనీ వాసులకు కృష్ణా వాటర్‌ను సరఫరా చేసే సబ్ చానల్ పైపు విరిగిపోయింది. దీనితో పైపును తొలగించారు. మరలా ఈ పైపును ఏర్పాటు చేయకపోవడంతో ఇరవై రోజులుగా కృష్ణా వాటర్ సరఫరా ఆగిపోయి ఈ రోడ్డులోని కాలనీ వాసులు తాగునీటి కొరతతో ఇబ్బందులు పడుతున్నారు.



రోడ్డుకు అడ్డంగా తవ్వి పూడ్చకుండా వదిలేసిన గొయ్యి



బీసీ కాలనీ మూడో రోడ్డు వద్ద కృష్ణా వాటర్ ప్రధాన పైపులైను నుంచి లీకై వృథాగా పోతున్న తాగునీరు

అంగన్‌వాడీ కార్యకర్తల శిక్షణ పూర్తి

ఇబ్రహీంపట్నం: జాతీయ విద్యా విధానం –2020 సిఫార్సుల మేరకు విద్యా బోధన విధానంలో మార్పులపై అంగన్‌వాడీ కార్యకర్తలకు కొండపల్లి బాలుర ఉన్నత పాఠశాలలో గత మూడు రోజులుగా జరుగుతున్న ప్రత్యేక శిక్షణ కార్యక్రమం గురువారంతో ముగిసింది. శిక్షణలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి పేరుతో ప్రాథమిక విద్యను బలోపేతం చేసేందుకు అమలు చేస్తున్న 'సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్' కార్యక్రమంపై ఐసీడీఎస్ అధికారులు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి, ఎంఈఓ రత్నశ్యాంబాబు, సూపర్‌వైజర్లు సీహెచ్ మాధవి, జి.రమాదేవి పాల్గొన్నారు.

నూజివీడులో న్యాయవిజ్ఞాన సదస్సు



నూజివీడు: మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక సాంఘిక సంక్షేమ బాలికల వసతిగృహం–1లో న్యాయ విజ్ఞాన సదస్సు గురువారం నిర్వహించారు. రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎం.శివ పార్వతి ముఖ్య అతిథిగా విచ్చేశారు. జడ్జి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పలు చట్టాలను వివరించారు. క్రమశిక్షణతో విద్యనభ్యసించి లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని వాటి సాధనకు కృషి చేయాలన్నారు. న్యాయవాదులు పద్మాంజలి, గోపీకృష్ణ, పారా లీగల్ వలంటీర్ విజయశాంతి, హాస్టల్ వార్డెన్ రామినేని సంధ్య పాల్గొన్నారు.

చిన్నారుల సమగ్ర అభివృద్ధికి శిక్షణ కార్యక్రమాలు

ఆగిరిపల్లి: ఐదేళ్లలోపు చిన్నారుల సమగ్ర అభివృద్ధి కోసమే జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని జిల్లా కో–ఆర్డినేటర్ మురళి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో అంగన్‌వాడీ శిక్షణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలకు ఆటపాటలతో విద్యను నేర్పే విధానంలో మెలకువలను శిక్షణలో అందిస్తారని, అభ్యసన నైపుణ్యాలు పెంపొందిస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఎంఈఓ కొవ్వలి ఆనంద్‌కుమార్, ఏఎంఓ రెడ్డి రామారావు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రాగమయి, రిసోర్స్‌పర్సన్ అంకం వెంకటేశ్వరరావు, డేవిడ్‌రాజ్, సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

రహదారిపైకి మురుగునీరు

- డ్రెయినేజీలు సక్రమంగా లేక సమస్య
- నిర్మించాలని వినతి

జి.కొండూరు: జి.కొండూరు నుంచి గడ్డమణుగు వెళ్లే రహదారిలో మలుపు వద్ద డ్రెయినేజీ సమస్య వాహన చోదకులను, స్థానికంగా నివాసం ఉండే ప్రజలను నిత్యం వేధిస్తోంది. ఈ మలుపు వద్ద రహదారి వెడల్పు తక్కువగా ఉండటంతో పాటు డ్రెయినేజీ వ్యవస్థ కూడా సక్రమంగా లేకపోవడంతో మురుగునీరంతా రహదారిపైకి చేరుతోంది. వర్షం కురిసిన సమయంలో అయితే ఈ ప్రాంతం నీటి కుంటలా మారుతోంది. అయితే రహదారి విస్తరణ పనులు జరుగుతున్నప్పటికీ ముందుగా డ్రెయినేజీల నిర్మాణం చేపట్టకపోవడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. రహదారి నిర్మాణం చేసినప్పటికీ డ్రెయినేజీలు లేకపోవడం వల్ల మురుగునీరంతా మరలా రహదారిపైకే చేరే అవకాశం ఉంది. ఈ ప్రాంతంలో పక్కా ప్రణాళికతో డ్రెయినేజీ నిర్మాణం చేసిన తర్వాతే రోడ్డు నిర్మిస్తే సమస్య పరిష్కారమవుతుందని పలువురు పేర్కొంటున్నారు. ఆ దిశగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.





జి.కొండూరులో రహదారిపైకి చేరిన మురుగు నీరు

నియోజకవర్గంలో ఎమ్మెల్సీ ఓటర్లు 9,652 మంది

నూజివీడు: ఈనెల 27న నిర్వహించనున్న కృష్ణా, గుంటూరు పట్టభద్రుల ఎన్నికలకు సంబంధించి నూజివీడు నియోజకవర్గంలో 9,652 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 5,987 మంది, మహిళలు 3,664 మంది, థర్డ్ జెండర్ ఒకరు చొప్పున ఉన్నారు. వీరు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు నియోజకవర్గ వ్యాప్తంగా 12 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అత్యధికంగా నూజివీడు పట్టణంలో ఆరు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా ఆగిరిపల్లి, ముసునూరు, చాట్రాయిలలో రెండేసి చొప్పున పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. నూజివీడులో ఎస్ఆర్ఆర్ హైస్కూల్‌లోనూ, జెడ్పీ బాలికల హైస్కూల్ ప్లస్‌లలో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా, ఆగిరిపల్లిలో, ముసునూరు, చాట్రాయిల్లో జెడ్పీ హైస్కూళ్లలో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎస్ఆర్ఆర్ హైస్కూల్‌లో నాలుగు పోలింగ్ కేంద్రాలను, జెడ్పీ బాలికల హైస్కూల్ ప్లస్‌లో రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆగిరిపల్లి మండలంలో 1,650 మంది ఓటర్లు, నూజివీడు పట్టణం, మండలం కలిపి 5,115 మంది, ముసునూరు మండలంలో 1,334 మంది, చాట్రాయి మండలంలో 1,553 మంది ఓటర్లు ఉన్నారు.

తిరువూరు నియోజకవర్గంలో 12 పోలింగ్ కేంద్రాలు

తిరువూరు: ఈ నెల 27న జరగనున్న కృష్ణా–గుంటూరు పట్టభద్రుల శాసనమండలి ఎన్నికకు తిరువూరు డివిజన్‌లో 12 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎ.కొండూరు ఎంపీపీ పాఠశాలలో 2, గంపలగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2, తిరువూరు జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో 3, విస్సన్నపేట జెడ్పీ హైస్కూల్లో 3, రెడ్డిగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటయ్యాయి. ఎ.కొండూరు మండలంలో 859 మంది పురుషులు, 418 మంది మహిళా ఓటర్లు, మొత్తం 1,277 మంది ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్లుగా నమోదయ్యారు. గంపలగూడెం మండలంలో 1,301 మంది పురుషులు, 521 మంది మహిళలు, మొత్తం 1,862 మంది ఓటర్లున్నారు. తిరువూరు మండలంలో 1,695 మంది పురుషులు, వెయ్యి మంది మహిళలు, మొత్తం 2,695 మంది ఓటర్లు నమోదయ్యారు. రెడ్డిగూడెం మండలంలో 1,019 పురుషులు, 556 మంది మహిళలు, మొత్తం 1,576 మంది ఓటర్లున్నారు. విస్సన్నపేట మండలంలో 637 పురుషులు, 419 మంది మహిళలు, మొత్తం 1,056 మంది ఎమ్మెల్సీ ఓటు హక్కు పొందారు. నియోజకవర్గంలో మొత్తం 6,123 మంది పురుషులు, 3,211 మంది మహిళలు, మొత్తం 9,337 మంది ఈ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

మున్సిపల్ కార్మికుల నిరసన



నిరసన తెలుపుతున్న నాయకులు, మున్సిపల్ కార్మికులు

ఇబ్రహీంపట్నం: కూటమి ప్రభుత్వం ఆప్కాస్‌ను రద్దు చేయాలంటే కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికులను తక్షణమే పర్మినెంట్ చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కొండపల్లి మున్సిపాలిటీ ప్రధాన కార్యదర్శి తమ్మిశెట్టి నరసింహారావు డిమాండ్ చేశారు. ఆప్కాస్‌ను రద్దు చేసి ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పజెబుదామన్న మంత్రి వర్గ సభ్యుల అభిప్రాయాలు పత్రికల్లో ప్రకటించడంపై ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పిలుపు మేరకు ఏఐటీయూసీ అనుబంధ సంఘం ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

ఎల్‌బీఆర్‌ఈసీ అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ తిమ్మారెడ్డి మృతి



మైలవరం: మైలవరం మండలం వెల్వడం గ్రామానికి చెందిన కుడుముల తిమ్మారెడ్డి (86) అనారోగ్యంతో గురువారం మృతిచెందారు. ఈయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌గా ఉన్నప్పుడు ఖమ్మం జిల్లాలో ఎలక్ట్రిసిటీ డీఈగా పనిచేశారు. రిటైర్ అయిన తర్వాత మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్‌గా సేవలందించారు. తిమ్మారెడ్డి మృతికి పలువురు సంతాపం తెలిపారు. స్వగ్రామం వెల్వడంలో శుక్రవారం అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

మిర్చికి గిట్టుబాటు ధర కల్పించాలి

తన్నీరు నాగేశ్వరరావు

జగ్గయ్యపేటఅర్బన్: ఆరుగాలం రైతులు కష్టపడి పండించిన మిర్చిపంటకు ప్రభుత్వం క్వింటాకు రూ.20 వేల చొప్పున గిట్టుబాటు ధర కల్పించాలని వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. గే వైరస్ ఇతర చీడ పీడల కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేల చొప్పున నష్ట పరిహారం ప్రకటించాలని కోరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం నియోజకవర్గానికి చెందిన పలువురు మిర్చి రైతులు తాము పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక ఇబ్బందులు పడుతున్నామంటూ మిర్చిని ప్రదర్శించారు. తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ మిర్చి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా నెల రోజులుగా వైఎస్సార్ సీపీ అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నా కూటమి ప్రభుత్వంలో ఎటువంటి చలనం లేకపోవడం బాధాకరమన్నారు. నష్టాల ఊబిలో కూరుకుపోయిన రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయడం గానీ, గిట్టుబాటు ధర కల్పించడం గానీ చేయాలని కోరారు.

పోలీసులపై కేసు నమోదు చేయాలని వినతి

ఆగిరిపల్లి: దళిత యువకుడు సంసోనుపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన పోలీసు అధికారులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి వారిని వెంటనే సస్పెండ్ చేయాలని ఎమ్మార్పీఎస్ ఆగిరిపల్లి మండల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు గురువారం తహసీల్దార్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ మైలవరం మండలం మొరుసుమల్లి గ్రామ శివారు ములకల పెంటలో జరిగిన హత్య కేసుకు సంబంధించి విచారణ పేరుతో అదే గ్రామానికి చెందిన దళిత యువకుడు వడ్లపూడి సంసోనుపై థర్డ్ డిగ్రీ ఉపయోగించి చిత్రహింసలకు గురిచేశారన్నారు. కేసుతో సంబంధం లేని వ్యక్తిని చిత్రహింసలకు గురిచేసిన పోలీసు అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు కంబాల ప్రదీప్, నల్లమోతు కాంచనరావు, మల్లంపల్లి రవిశేఖర్, బోకినాల శ్రీనివాసరావు, చౌటపల్లి రమేష్, ప్రకాష్, కమలాకర్ పాల్గొన్నారు.

వాహనం ఢీకొని 15 గొర్రెలు మృతి



మైలవరం: ఇంటి సామగ్రితో వస్తున్న ట్రక్కు వాహనం ఢీకొని 15 గొర్రెలు మృతిచెందాయి. ఈ ఘటన బుధవారం రాత్రి జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం.. మైలవరం మండలం పొందుగల రోడ్డులో నివాసం ఉంటున్న గొర్రెల కాపరులు తమ గొర్రెలను మేత కోసం చంద్రగూడెం పొలాల్లోకి తోలుకువెళ్లారు. రాత్రి పొద్దుపోయిన తర్వాత తిరిగి వాటిని ఇంటికి తోలుకొస్తున్నారు. మైలవరంలోని దర్గా సమీపంలో గొర్రెలు రోడ్డు దాటుతుండగా ట్రక్కు వాహనం జీవాలపైకి దూసుకువెళ్లడంతో 15 గొర్రెలు మృతి చెందాయి. మరికొన్ని జీవాలు గాయలపాలయ్యాయి. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

బీరు బాటిల్‌తో గొంతు కోసుకుని వీరంగం

మైలవరం: ఓ యువకుడు బీరు బాటిల్‌తో గొంతు కోసుకుని వీరంగం సృష్టించాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మైలవరం మండలం పొందుగల గ్రామానికి చెందిన యువకుడు శ్రీను గత రాత్రి తప్పతాగి రోడ్డుపై అడ్డగోలుగా తిరుగుతూ వాహనాలకు అంతరాయం కలిగించాడు. గురువారం ఉదయం గ్రామానికి ప్రవేశ మార్గంలో ఉన్న మల్లెతోట వద్ద లభించిన ఖాళీ బీరు బాటిళ్లను పగలగొట్టి గొంతు కోసుకుని వీరంగం చేశాడు. గమనించిన గ్రామానికి చెందిన కొందరు యువకులు శ్రీనును చికిత్స నిమిత్తం మైలవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా గత కొంతకాలంగా ఈ యువకుడు మతిస్థిమితం కోల్పోయి తప్పతాగి గ్రామంలోని రహదారుల్లో అడ్డగోలుగా తిరుగుతున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు.

మద్యంపై ఫిర్యాదులకు టోల్‌ఫ్రీ నంబర్

తిరువూరు: అక్రమ మద్యం అమ్మకాలు, తయారీ, గరిష్ట చిల్లర కంటే అధిక ధరకు విక్రయాలు తదితర సమాచారాన్ని తెలిపేందుకు ప్రభుత్వం టోల్‌ఫ్రీ నంబరు కేటాయించిందని తిరువూరు ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. 14405 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చని, ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచుతామని చెప్పారు.